క్లుప్తంగా

ప్రైవేట్ ట్రావెల్స్ ఢీకొని 11 గేదెలు మృత్యువాత



గేదెలను ఢీకొనడంతో దెబ్బతిన్న ట్రావెల్స్ ముందుభాగం

ఉదయగిరి: మండలంలోని కొండ్రపల్లి వద్ద సోమవారం రాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ ఢీకొనడంతో 11 గేదెలు మృత్యువాత పడ్డాయి. ప్రకాశం జిల్లా నుంచి బెంగళూరుకు బయలుదేరిన ట్రావెల్స్ బస్సు సీతారామపురం నుంచి ఉదయగిరికి వస్తున్న క్రమంలో కొండ్రపల్లి వద్ద రోడ్డుపై ఉన్న 12 గేదెలను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతినగా, 11 గేదెలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మరో గేదె కొనఊపిరితో ఉంది.



ఘటనా స్థలంలో మృత్యువాత పడిన గేదెలు

సత్యసాయి సేవా సమితి చేయూత



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి గిరిజనకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సమితి భజన మండలి నిర్వాహకులు సోమవారం చేయూతనందించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వీ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు చాపలు, పలకలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. చిన్నారుల తల్లులు 50 మందికి చీరలు వితరణ చేశారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాలలోనివిద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పలకలు, బిస్కెట్ ప్యాకెట్లు, తదితరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ వీ సుగుణ, కన్వీనర్ జే నాగరాజశర్మ, సర్వీస్ కోఆర్డినేటర్ ఎస్ నాగలక్ష్మి, వాసవీక్లబ్ జోనల్ మేనేజర్ ఎన్ సంతోష్, అంగన్‌వాడీ మస్తానమ్మ, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని కావేరి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. 3వ వార్డుకు చెందిన సయ్యద్ రహ్మతున్నీసా, 13వ వార్డుకు చెందిన శాగలమూరి రవిచంద్ర, 14వ వార్డుకు చెందిన నల్లమేకల మస్తానయ్య ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులకు ట్రస్ట్ సభ్యులు రూ.10వేలు చొప్పున సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, నారసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం పొగమంచు దట్టంగా కురిసింది. 8 గంటల వరకు పొగమంచు వీడలేదు. దీంతో సీతారామపురం –కావలి జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. ఉదయగిరి నియోజకవర్గంలో పగలు ఎండవేడి, రాత్రి వేళ చలి, ఉదయాన్నే పొగమంచుతో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ వాతావరణ ప్రభావంతో సాగులో ఉన్న పంటలకు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

కావలి: పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేరం వెంకటేశ్వర్లు మృతిపై మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు. వెంకటేశ్వర్లు అకాల మరణం బాధాకరమని, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కలిగిరి పెద్దచెరువు వాగులో మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంత



కలిగిరి పెద్దచెరువు వాగులోని మట్టిని అర్ధరాత్రి జేసీబీ, ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం



యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- జేసీబీ, ట్రాక్టర్ల యజమానుల దందా
- అనుమతుల్లేకుండానే లేఅవుట్లు, ప్రైవేట్ నిర్మాణాలకు తరలింపు
- తిప్పలు, చెరువులను కొల్లగొడుతున్న వైనం
- పోలీసులు, అధికారుల పేరుతో అధిక వసూళ్లు

కలిగిరి: మండలంలో జేసీబీ, ట్రాక్టర్ల యజమానులు సిండికేట్లుగా మారి యథేచ్ఛగా మట్టిని, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. తిప్పలు, చెరువులు, ఉత్తర కాలువ కట్టలను కొల్లగొట్టి లేఅవుట్లు, ప్రైవేట్ నిర్మాణాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే అధికారులు, పోలీసుల పేరు చెబుతూ భారీగా వసూళ్లు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు సైతం గండికొడుతున్నారు.

పోలీసులు, అధికారుల పేర్లతో..

మండలంలో కొత్తగా లేఅవుట్లు, పెట్రోలు బంకులు, ఇతర ప్రైవేట్ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటికి అధిక మొత్తంలో గ్రావెల్, చెరువు మట్టి, పూటి ఇసుక అవసరం. దీనిని అసరాగా చేసుకున్న జేసీబీ, ట్రాక్టర్ల యజమానులు గ్రావెల్ అవసరం ఉన్న వారిని సంప్రదిస్తున్నారు. మీరు అనుమతులు తీసుకుని మట్టి తోలుకోవాలంతే చాలా ఖర్చు అవుతుంది.. నెలల తరబడి అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది..మీకు మట్టి తోలుకోవడం చాలా కష్టం అవుతుంది..మేము అడిగిన డబ్బులు ఇస్తే అన్ని మేమే చూసుకుంటామని అని భరోసా ఇస్తున్నారు. అధికారులు, పోలీసుల పేర్లు చెబుతూ అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారు. అనంతరం అనుమతుల్లేకుండానే రాత్రి వేళల్లో అధిక సంఖ్యలో ట్రాక్టర్లను వినియోగిస్తూ అవసరమైన చెరువు మట్టి, గ్రావెల్, ఇసుకను అందిస్తున్నారు. ఒక వేళ ఎవరైనా సిండికేట్‌ను సంప్రందించకుండా నేరుగా తొలుకునే ప్రయత్నం చేస్తే అడ్డుకుని వాహనాలను అధికారులకు పట్టిస్తున్నారు.

చెరువులు, తిప్పలు, ఉత్తరకాలువను వదలడం లేదు

మండల కేంద్రమైన కలిగిరితో పాటు వెలగపాడు, నాగసముద్రం, తదితర ప్రాంతాల్లో లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. జాతీయ రహదారిని అనుకుని లేఅవుట్లు, వాణిజ్య దుకాణాల నిర్మాణాలు చేపడుతుండడంతో భారీ మొత్తంలో గ్రావెల్ అవసరమవుతోంది. కలిగిరి, పెద్దఅన్నలూరు, వెలగపాడు, నాగసముద్రం, వీర్నకొల్లు చెరువులు, వాగుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. దీంతో మట్టి తవ్విన ప్రాంతంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఆ గోతుల్లోకి నీరు చేరితే పశువులు, మనుషులు అందులో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కలిగిరిలోని ఓ ప్రైవేట్ స్థలంలో డంప్ చేసిన వాగు మట్టి

అనుమతుల్లేకుండా తరలిస్తే చర్యలు

చెరువులు, వాగులు, తిప్పల నుంచి అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్, ఇసుక తరలిస్తే సంబంధిత వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తాం, పోలీస్‌శాఖ తరుపున ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా మట్టి తవ్వకాలు, తరలింపుపై ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటాం.

– పీ వెంకటనారాయణ, సీఐ, కలిగిరి

అనుమతులు తప్పనిసరి

చెరువులు, వాగుల నుంచి మట్టి తరలింపునకు అనుమతులు తప్పనిసరి. అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. కలిగిరి పెద్దచెరువు వాగు పొరంబోకు నంచి శనివారం అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలించిన వారిపై కేసులు నమోదు చేయిస్తాం.

–శ్రీనాథ్, ఏఈ, ఇరిగేషన్, కలిగిరి

అక్రమ తరలింపు అడ్డగింత

కలిగిరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ స్థలానికి భారీ స్థాయిలో చెరువు మట్టిని తరలించడానికి సిండికేట్ ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం అర్ధరాత్రి కలిగిరి పెద్దచెరువు వాగుపొరంబోకు నుంచి మట్టిని ట్రాక్టర్ల ద్వారా వందల ట్రిప్పులను తరలించారు. ఆదివారం రాత్రి మళ్లీ జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించడం ప్రారంభించారు. కొందరు స్థానికులు ఇరిగేషన్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఉమాశంకర్ అక్రమ తరలింపును అడ్డుకుని నిలిపివేశారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో తనిఖీలు



వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగులలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను వరికుంటపాడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు సోమవారం తనిఖీ చేశారు. హెల్త్‌సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిష్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేరు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్రంలో సరిపడా మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు



ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు అందినట్లు తహసీల్దార్ సుధీర్ తెలిపారు. ఆర్డీఓ బీ పావని శిక్షణా కార్యక్రమానికి విజయవాడకు వెళ్లడంతో ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఎం నిరంజన్‌తో కలిసి తహసీల్దార్ సుధీర్ వినతులు స్వీకరించారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి 11 అర్జీలు అందగా, వాటిని సంబంధిత అధికారులకు పంపించారు. సీడీపీఓ సునీలత, హెల్త్ సూపర్‌వైజర్ శైలజతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రథోత్సవంలో అపశృతిలో కుట్రకోణం!

- భక్తుల నిరసనను తట్టుకోలేక తెరపైకి
- తప్పుడు ఫిర్యాదుతో ఈఓను కాపాడే ప్రయత్నం
- తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు దేవదాయశాఖ కొత్త నాటకం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం బ్రహ్మోత్సవాల్లో జరిగిన తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు దేవదాయశాఖ అధికారులు కొత్త నాటకానికి తెరతీశారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయంలో అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులు భక్తుల నిరసనను తట్టుకోలేక చివరకు రథోత్సవం అపశృతిలో కుట్రకోణాన్ని తెరపైకి తీసుకొచ్చారు. తప్పుడు ఫిర్యాదుతో పోలీసులను ఆశ్రయించారు. ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రథానికి సంబంధించిన బేరింగులు విరిగిపోయి రథం నిలిచిపోయిన విషయం తెలిసిందే. రథం చుట్టూ వేలాది మంది భక్తులు ఉండగా బేరింగులు విరిగిపోయి రథం ఒక్క పక్కకు ఒరిగినట్లుగా నిలిచిపోయింది. రథం ఏ మాత్రం అదుపుతప్పినా చుట్టూ ఉన్న భక్తుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేది. ఈ ఘటన జరిగిన వెంటనే భక్తుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. రథం వద్దే ఈఓ రాధాకృష్ణ, అతని సోదరుడు రాంబాబుకు వ్యతిరేకంగా భక్తులు, కొండబిట్రగుంట, పాతబ్రిగుంట గ్రామస్తులు తీవ్ర స్థాయిలో నినాదాలు చేశారు. ఈఓను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు సర్దిచెప్పినా కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల్లో ఈఓ వైఖరిపై నిరసనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ఈఓ ఆదివారం సాయంత్రం బిట్రగుంట పోలీసులకు 'కుట్ర' కోణంపై ఫిర్యాదు చేశారు. రథోత్సవానికి 20 రోజుల ముందే రథానికి మరమ్మతులు చేయించామని, రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నీ సరిగ్గానే ఉన్నా బేరింగులు విఫలమవడం వెనుక కుట్ర కోణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయంటూ పోలీసులను ఆశ్రయించడంపై అటు పోలీసులు, ఇటు భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యమే కారణమని తెలిసినా..

బ్రహ్మోత్సవాల్లో దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యమే అన్నీ అనర్థాలకు కారణమని తెలిసినా చివరకు తప్పుడు ఫిర్యాదుతో పోలీసులను కూడా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హనుమంతసేవ రోజు కూడా బాణసంచా పేలి ఆటో దగ్ధమైన ఘటనలో భక్తులు త్రుటిలో తప్పించుకున్నారు. హనుమంత వాహనం కొండ దిగుతున్న సమయంలోనే ప్రమాదం జరిగింది. ఆటో దగ్ధమైన ప్రాంతానికి, హనుమంతసేవకు మధ్య కొంచెం దూరం ఉండడంతో భక్తులకు ప్రాణాపాయం తప్పింది. రెండు నిమిషాలు ఆలస్యంగా ప్రమాదం జరిగి ఉంటే హనుమంతసేవ ఆటో దగ్గరగా వచ్చి ఊహించని స్థాయిలో ముప్పు ఏర్పడేది. ఈ ఘటనలో కూడా ఆటో పూర్తిగా కాలిపోయే వరకూ ఫైరింజన్ రాలేదు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు కొండ దిగువన ఉండాల్సిన ఫైరింజన్ ఎందుకు అందుబాటులో లేదో ఎవరికీ అర్థం కాలేదు. కల్యాణోత్సవ సమయంలోనూ అధికారులు భక్తులను కనీసం పట్టించుకోలేదు. గంటల తరబడి ఉక్కపోతలో కూర్చున్న భక్తులకు వాటర్‌ప్యాకెట్లు కూడా పంపిణీ చేయలేదనే ఆరోపణలు వినిపించాయి. రథోత్సవం విషయంలోనూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అపశృతి దొర్లింది. రథం నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. 2023లో జరిగిన విధంగా ఒక పక్కకు ఒరిగిపోయి ఉంటే భక్తుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే బ్రహ్మోత్సవాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆలయ అధికారులు చివరకు కుట్రకోణాన్ని తెరపైకి తీసుకువచ్చారంటూ భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈఓ వైఖరిపై విచారణ చేపట్టాలి

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ నిర్లక్ష్య వైఖరి, కొండపై తిష్టవేసిన అతని సోదరుడు రాంబాబు అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హుండీ లెక్కింపు సందర్భంగా ఆలయానికి వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని గ్రామస్తులు కలిసి సుమారు 60 మందికి పైగా సంతకాలు చేసిన లిఖితపూర్వక ఫిర్యాదును సోమవారం అందజేశారు. కొండపై ఈఓ నిర్లక్ష్య వైఖరి, అహంకారధోరణి కారణంగా స్వామివారి సేవలకు విఘాతం ఏర్పడడంతో పాటు భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని అందులో పేర్కొన్నారు. ఈఓ నిర్లక్ష్యం కారణంగానే 2023లో రథం ఒక్కపక్కకు ఒరిగిపోయిందని, ఈ దఫా బ్రహ్మోత్సవాల్లోనూ రథం బేరింగ్‌లు పట్టేసి రథోత్సవం నిలిచిపోయిందన్నారు. రథం నిలిచిపోయిన విషయాన్ని వెంటనే ఈఓ దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆరోపించారు. ఈఓ కోసం వెళితే ఆయన సోదరుడు రాంబాబు 'ఈఓతో ఏం పని..నాకు చెప్పండి పని ఏంటో' అంటూ పెత్తనం చెలాయిస్తున్నాడని విమర్శించారు. కొండపై ఈఓ సోదరుడి దౌర్జన్యాలు మాటల్లో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈఓ, ఆయన సోదరుడు కొండపైన కల్యాణ మండపాల టెంట్లు ఏర్పాటు చేసుకుని పెళ్లి చేసుకునేందుకు వచ్చే భక్తులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కొండపై పెళ్లి జరగాలంటే 'మేమే కల్యాణ మండపాలు కట్టాలి... వేరే వాళ్లతో కట్టించుకుంటే ఒప్పుకోం...పెళ్లి కూతురు దుస్తులు మార్చుకునేందుకు రూము కూడా ఇవ్వం' అని బెదిరిస్తున్నారని అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమగ్రం విచారణ జరిపి కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



అసిస్టెంట్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామస్తులు

నేడు ఆదరణ-3పై సమావేశం

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదరణ–3 పథకం అమలుపై మండల పరిషత్ కార్యాలయంలో బీసీ సామాజిక వర్గానికి సంబంధించిన సంప్రదాయ కులవృత్తుల నాయకులు, పెద్దలతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సోమవారం తెలిపారు. బీసీ కులవృత్తుల వారికి అవసరమైన ఉపకరణాలపై చర్చించనున్నట్లు వివరించారు.

సీసీకెమెరాలతో నేరాల నియంత్రణ

సంగం: సీసీకెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని సంగం సీఐ వేమారెడ్డి తెలిపారు. మండలంలోని సిద్దీపురం వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గ్రామానికి చెందిన సూరా శ్రీనివాసులురెడ్డి సహకారంతో సీసీ కెమెరాలను ఎస్సై రాజేష్ సోమవారం ఏర్పాటు చేయించారు. సీఐ పరిశీలించి మాట్లాడారు. మండలంలో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి గొడుగుల బహూకరణ



వింజమూరు(ఉదయగిరి): పెంచలకోనలో కొలువైన పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి వింజమూరులోని జైభీంనగర్ కాలనీకి చెందిన భక్తులు నూతన గొడుగులను సోమవారం బహూకరించారు. గతంలో స్వామివారికి మొక్కుకున్న నేపథ్యంలో గొడుగులను ఊరేగింపుగా తీసుకెళ్లి బహూకరించినట్లు వారు తెలిపారు. స్థానికులు కాలవ నరసింహులు, చిన్నమ్మ, పెంచలరావు, వరలక్ష్మి, శేఖర్ పాల్గొన్నారు.

28న సొసైటీ మహాజన సభ

దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెం సొసైటీ మహాజన సభను ఈ నెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ సీఈఓ సీహెచ్ లోకనాథరెడ్డి సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సొసైటీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో రూ.14 కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలను ప్రజావేదికలో చదివి వినిపించనున్నట్లు చెప్పారు. జిల్లా డ్వామా, విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు హాజరై అవకతవకలపై విచారణ చేపడుతారని తెలిపారు.

ఆశీర్వాదం



సీతారామపురం: మండలంలోని గుండుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన చప్పిడి వారి వివాహ వేడుకకు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధువు దివ్యను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు అల్లూరురాజు, తిరుపతిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జనార్దన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు



సంగం: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



సీతారామపురం: విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయుడు



దుత్తలూరులో పరీక్షకు హాజరైన విద్యార్థులు



ఆత్మకూరు: జూనియర్ కళాశాల కేంద్రంలో విద్యార్థుల, తల్లిదండ్రుల కోలహలం



అనుమసముద్రంపేటలో పోలీసు బందోబస్తు

ఆత్మకూరు: పట్టణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యారు. పట్టణంలోని ఆరు కేంద్రాల్లో రెగ్యులర్, నాలుగు కేంద్రాల్లో ఒకేషనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ జానకీరామ్, డిపార్ట్‌మెంటల్ అధికారి మాలకొండయ్య, చీఫ్ అనంతలక్ష్మి తెలిపారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 72 మంది, సెయింట్‌మేరీస్ పాఠశాలలో 155 మంది, శ్రీచైతన్య పాఠశాలలో 157మంది, శ్రీనివాసలో 124 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 132 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద సీఐ జి గంగాధర్, ఎస్సై ఎస్కే జిలానీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ఆదర్శ పాఠశాలలో 144 మంది విద్యార్థులకు గానూ నలుగురు పరీక్షకు గైర్హాజరయ్యారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 104 మంది విద్యార్థులకు గానూ ఒకరు గైర్హాజరయ్యారని డిపార్ట్‌మెంటల్ అధికారులు తెలిపారు. పరీక్షలు పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఇతరులు ఎవరూ ఉండరాదని ఎస్సై సైదులు తెలిపారు.

దుత్తలూరు: మండలంలోని నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 195 మందికి గానూ 192 మంది, దుత్తలూరు ఉన్నత పాఠశాలలో 84 మందికి గానూ 83 మంది, ఆదర్శ పాఠశాలలో 178 మందికి గానూ 178 మంది పరీక్షకు హాజరయ్యారు. తొలిరోజు కావడంతో పరీక్ష కేంద్రాల వద్ద తల్లిదండ్రుల కోలాహలం నెలకొంది.

సీతారామపురం: స్థానిక ఆదర్శపాఠశాలలో తొలిరోజు తెలుగు పరీక్షకు 259 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు 17 మంది సప్లిమెంటరీ విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు వెంకటేశ్వర్లు, కరిముల్లా హుస్సేన్ తెలిపారు.

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు మండలాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి.వింజమూరులోని ఐదు పరీక్ష కేంద్రాల్లో650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

సంగం: స్థానిక గురుకుల కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలిరోజు తెలుగు పరీక్షకు 443 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గృహ నిర్మాణాలకు సహకరించాలని వినతి



చేజర్ల: మండలంలోని ఏటూరిలోని దళితులు, బీసీలకు గృహ నిర్మాణాలకు ప్రభుత్వ సహకారాన్ని అందించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉగ్గుమూడి రఘురామిరెడ్డి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ మురళికి వినతి పత్రం అందజేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి చెందిన దళితులు, బీసీలు సుమారు 30 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. అయితే వారిని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో గృహ నిర్మాణాలకు ప్రభుత్వ సాయం అందలేదని విన్నవించారు. అధికారులు స్పందించి గృహ నిర్మాణాలకు ప్రభుత్వం సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

- 11సవర్ల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ



దొంగలు కట్ చేసిన కిటీకిని పరిశీలిస్తున్న పోలీసులు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని నందిగుంటలోని ఓ ఇంట్లో సోమవారం ఉదయం దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు..గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బాషా–బీబీజాన్ ఉదయం తమ సొంత పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇంటి కిటికీ కమ్ములు కట్‌చేసి దొంగలు లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 11 సవర్ల బంగారం, రూ.లక్ష నగదు అపహరించారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగొచ్చిన దంపతులు దొంగతనం జరిగినట్లు గుర్తించి ఎస్సై వీరప్రతాప్‌కు ఫిర్యాదు చేశారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.